క్లుప్తంగా

'కేటీఆర్ ఎర్రగడ్డ ఆస్పత్రికి వెళ్లాలి'

ములుగు: మాజీ మంత్రి కేటీఆర్ మేడిగడ్డ బ్యారేజీకి కాదు ఎర్రగడ్డ మెంటల్ ఆస్పత్రికి వెళ్లాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా సీనియర్ నాయకుడు బాదం ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ నాయకుల జిమ్మిక్కులను నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరని అన్నారు. మాజీ సీఎం కేసీఆర్ మెడకు ఖచ్చితంగా ఉచ్చు బిగిస్తుందని తెలిసి అడ్డుకోవడానికి విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారని పేర్కొన్నారు. అవినీతికి బాధ్యులైన కేసీఆర్, కేటీఆర్‌లకు శిక్ష ఖాయమని అన్నారు. ఇప్పటికైనా చేసిన తప్పుని ఒప్పుకోవాలని సూచించారు. ఓటమితో మతి భ్రమించిందని, బయటపడి అసలు నిజాలు ప్రజలకు చెప్పాలని అన్నారు.

గీతకార్మికుడికి గాయాలు



వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని దుర్గమ్మ గుడి సెంటర్‌లో శనివారం తాటిచెట్టుపై నుంచి పడి గీతకార్మికుడు గాయపడ్డాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గీత కార్మికుడు మల్లయ్య శనివారం సాయంత్రం కల్లు తీసేందుకు తాటిచెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు జారి కింద పడ్డాడు. దీంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు మల్లయ్యను వెంకటాపురం వైద్యశాలకు తరలించి చికిత్స నిర్వహించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించారు.

సీఆర్పీఎఫ్ ఆధ్వర్యంలో వాలీబాల్ పోటీలు



వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణంలో శనివారం సీఆర్పీఎఫ్ ఈ /39 బెటాలియన్ ఆధ్వర్యంలో సివిక్ యాక్షన్ ప్రోగ్రామ్‌లో భాగంగా వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సీఆర్పీఎఫ్ కమాండెంట్ రమాకాంత్ పాండ హాజరయ్యారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. వివిధ గ్రామాలకు చెందిన క్రీడాకారులకు వాలీబాల్ నెట్స్, వాలీబాల్స్ అందజేశారు. కార్యక్రమంలో సీఆర్పీఎఫ్ ఆఫీసర్ ఇన్ కమాండెంట్ విజయ్ కుమార్ ఉన్నారు.

'విద్యాహక్కు చట్టం నిర్వీర్యం'

గార్ల: ప్రభుత్వ ఇటీవల విడుదల చేసిన డీఎస్సీ నోటిఫికేషన్‌లో డ్రాయింగ్, క్రాఫ్ట్, మ్యూజిక్ టీచర్ పోస్టులను ప్రకటించకపోవడం విద్యాహక్కు చట్టాన్ని నిర్వీర్యం చేయడమేనని రాష్ట్ర హ్యూమన్ రైట్స్ ఎగ్జిక్యూటివ్ అధ్యక్షుడు భూక్యా వినోద్‌కుమార్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో డ్రాయింగ్, క్రాఫ్ట్, మ్యూజిక్‌లో 3లక్షల మంది శిక్షణ పూర్తి చేసి డీఎస్సీ కోసం ఎదురు చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు.

జవాన్‌కు ఘన స్వాగతం

దుగ్గొండి : ఆర్మీలో 20 ఏళ్లపాటు సేవలు అందించి ఉద్యోగ విరమణ పొందిన జవాన్‌కు స్వగ్రామంలో గ్రామస్తులు శనివారం రాత్రి ఘనస్వాగతం పలికారు. మండలంలోని నాచినపల్లి గ్రామానికి చెందిన వడ్డేపల్లి చంద్రమౌళి–భాగ్యమ్మ దంపతుల కొడుకు విక్రమ్ 2004లో ఆర్మీలో చేరాడు. పంజాబ్, అస్సాం, హిమాచల్ ప్రదేశ్, జమ్ము కశ్మీర్, సిక్కింల్లో సేవలు అందించి ఫిబ్రవరి 29న ఉద్యోగ విరమణ పొందాడు. ఈ సందర్భంగా ఆయన స్వగ్రామానికి రాగా యువజన, పద్మశాలీ సేవా సంఘాల ఆధ్వర్యంలో స్వాగతం పలికారు.

పేదల సంక్షేమమే ధ్యేయం

మొగుళ్లపల్లి: పేదల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. శనివారం మండల కేంద్రంలో ప్రభుత్వం గృహ జ్యోతి పథకం కింద ప్రవేశపెట్టిన 200 యూనిట్లు ఉచిత విద్యుత్‌తో పాటు మహాలక్ష్మి పథకం కింద ప్రవేశపెట్టిన రూ.500లకే గ్యాస్ సిలిండర్ పథకాలను వారు ప్రారంభించి మాట్లాడారు. ఎన్నికల్లో హామీల అమల్లో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తుందని అన్నారు.

అడవి జంతువు మాంసం స్వాధీనం

మహదేవపూర్: అడవి జంతువు మాంసం స్వాధీనం చేసుకున్న సంఘటన మండలంలోని సూరారంలో శనివారం చోటు చేసుకుంది. హెడ్‌కానిస్టేబుళ్లు ఉపేందర్, ధనుంజయ్ తెలిపిన వివరాల ప్రకారం.. సూరారం గ్రామానికి చెందిన సురేష్ వద్ద అటవీ మాంసం ఉందనే విశ్వసనీయ సమాచారంతో తనిఖీ చేసి స్వాధీనం చేసుకుని అధికారులకు అప్పగించినట్లు తెలిపారు. అటవీ శాఖ రేంజి అధికారి కమలను వివరణ కోరగా.. పోలీసులు కిలో అడవి జంతువు మాంసం, నిందితుడు రమేష్‌ను అప్పగించినట్లు తెలిపారు.

శ్రీపాదరావుకు ఘన నివాళి



శ్రీపాదరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అడిషనల్ కలెక్టర్, అధికారులు



ఏటూరునాగారం: నివాళులర్పిస్తున్న డీడీ పోచం

● ఐటీడీఏలో జయంతి వేడుకలు

ములుగు: సర్పంచ్ పదవి నుంచి అంచలంచెలుగా ఎదిగి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలవడమే కాకుండా అసెంబ్లీ స్పీకర్ పదవికి వన్నె తెచ్చిన మహనీయుడు శ్రీపాదరావు అని అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) సీహెచ్ మహేందర్ జీ అన్నారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో శనివారం స్వర్గీయ దుద్దిళ్ల శ్రీపాదరావు 87వ జయంతిని అధికారికంగా నిర్వహించారు. మహేందర్ జీ ముఖ్యఅతిథిగా హాజరై శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంథని నియోజకవర్గాన్ని ఎంతగానో అభివృద్ధి చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ ప్రసాద్, సూపరింటెండెంట్ రాజ్‌ప్రకాశ్, కలెక్టరేట్, ఆర్డీఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అంచెలంచెలుగా ఎదిగి..

ఏటూరునాగారం: దివంగత దుద్దిళ్ల శ్రీపాదరావు కిందిస్థాయి నుంచి ఎదిగి ప్రజల గుండెల్లో నిలిచారని ఐటీడీఏ డిప్యూటీ డైరెక్టర్ పోచం అన్నారు. మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయంలో శ్రీపాదరావు జయంతి కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా డీడీ పోచం, ఏఓ దామోదరస్వామి, ఎస్ఓ రాజ్‌కుమార్ తదితరులు శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం డీడీ పోచం మాట్లాడుతూ.. శ్రీపాదరావు కాటారం మండలం దన్వాడ సర్పంచ్ నుంచి ఎమ్మెల్యేగా పనిచేసి మంథని నియోజకవర్గ అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారని తెలిపారు. స్పీకర్‌గా పనిచేసి ఆ పదవికే వన్నె తెచ్చారని కొనియాడారు. కార్యక్రమంలో ఐటీడీఏ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలల్లో వసతులు కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న బైరేష్

ములుగు రూరల్: గురుకుల పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు కావిరి బైరేష్ అన్నారు. ఈ మేరకు శనివారం జిల్లా కేంద్రంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మల్లంపల్లిలో నిర్వహిస్తున్న సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో మౌలిక వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పాఠశాలలో విద్యార్థులకు సరిపడా టాయిలెట్స్ లేక అటవీ ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వం గురుకుల పాఠశాలలకు పక్కా భవనాలను కేటాయించాలని కోరారు. విద్యార్థుల తల్లిదండ్రులతో గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు దురుసగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి కోయిల బాలు, స్వామి, రవితేజ, శివ కేశవ, తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలపై ప్రజలకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న కళాకారులు

వాజేడు: ఆరు గ్యారంటీలపై సాంస్కృతిక సారథి కళాకారులు ఆటపాటలతో ప్రజలకు అవగాహన కల్పించారు. తహసీల్దార్ కార్యాలయం ఆవరణతోపాటు గుమ్మడి దొడ్డి, జగన్నాథపురం గ్రామాల్లో కళాకారులు శనివారం తెలంగాణ సాంస్కృతిక సారథి మార్త రవి బృందం ఈ అవగాహన కల్పించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఆరు గ్యారంటీలపై ప్రజలు అవగాహన అవసమని, అర్హులందరూ అధికారులను సంప్రదించి దరఖాస్తు చేసుకుని పథకాలను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వాజేడు తహసీల్దార్ శ్రీనివాస్, కళాకారులు మార్త రవి, రాగుల శంకర్, రహీముద్దీన్, సాగర్, రాజేందర్, బుచ్చన్న, కిషన్, విజయ్, సురేష్, తిరుపతి, కుమార్, భాస్కర్, నరేష్, దీపక్, రాము, శ్రీలత, శోభ ఉన్నారు.

మహిళలు అన్నిరంగాల్లో ముందుండాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీఓ అవంతి

భూపాలపల్లి రూరల్: మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని భూపాలపల్లి సీడీపీఓ అవంతి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం మంజూర్‌నగర్‌లోని సింగరేణి ఫంక్షన్‌హాల్‌లో ఆర్‌డీటీ ఎల్‌బీసీ హెచ్‌ఎఫ్ ఎల్ సంస్థ వారు ఏర్పాటు చేసిన కార్యక్రమానికి భూపాలపల్లి సీడీపీఓ అవంతి, రీజనల్ డైరెక్టర్ రామేశ్వరీ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఇంట్లో ఆడ, మగ పిల్లల్ని సమానంగా చూడాలన్నారు. అలాగే మహిళా చట్టాల గురించి అవగాహన కల్పించారు. ఏటీఎల్ సుబ్రమణ్యం, లక్ష్మయ్య మహిళలు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి గుణపాఠం తప్పదు



సమావేశంలో మాట్లాడుతున్న రవి

గీసుకొండ : రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి గుణపాఠం తప్పదని ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి స్పష్టం చేశారు. మండలంలోని గంగదేవిపల్లిలో శనివారం నిర్వహించిన ఆ పార్టీ రాష్ట్ర సమావేశాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ అన్ని వర్గాల ప్రజలకు నష్టం కలిగించేలా, కార్పొరేట్ శక్తులకు లబ్ధి చేకూర్చేలా మోసపూరిత పాలన సాగిస్తోందని విమర్శించారు. ప్రధాని మోదీ నియంతృత్వంపై ఉద్యమాలు తప్పవన్నారు. మోదీ అనుసరిస్తున్న మనువాద రాజ్యపోకడలకు, ప్రజాస్వామ్య శక్తులకు మధ్యే రానున్న పార్లమెంటు ఎన్నికలు జరగనున్నట్లు తెలిపారు. బీఎల్ఎఫ్‌తో కలిసి వరంగల్, మహబూబాబాద్, చేవెళ్ల పార్లమెంటు స్థానాల్లో అభ్యర్థులను నిలుపుతామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ దుష్టపాలనకు వ్యతిరేకంగా ప్రజాఉద్యమాలు నిర్మించాలని శ్రేణులకు సూచించారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలు అమలు చేసేలా పోరాడాలని చెప్పారు. సమావేశానికి రాష్ట్ర నాయకురాలు వంగల రాగసుధ అధ్యక్షత వహించగా పొలిట్‌బ్యూరో సభ్యుడు వల్లెపు ఉపేందర్‌రెడ్డి, కేంద్ర కమిటీ సభ్యులు వనం సుధాకర్, కుంభం సుకన్య, గోనె కుమారస్వామి, జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేశ్, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎన్‌రెడ్డి హంసరెడ్డి, మంద రవి, తుకారాం నాయక్, తాండ్ర కళావతి, సావిత్ర, తదితరులు పాల్గొన్నారు.

'లక్‌పతి దీదీ'తో మహిళలకు లబ్ధి



దుగ్గొండి: మాట్లాడుతున్న ఏపీఎం గీతారాణి

ఖానాపురం : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన లక్‌పతి దీదీ పథకంతో మహిళలకు ఆర్థికంగా లబ్ధి చేకూరనుందని డీపీఎం సరిత తెలిపారు. మండల కేంద్రంలోని సమాఖ్య కార్యాలయంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మహిళా సంఘాల్లోని సభ్యులు లక్‌పతి దీదీ పథకాన్ని వినియోగించుకుని ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం కావాలని సూచించారు. మహిళలకు జీవనోపాధులను మెరుగుపర్చడమే పథకం ఉద్దేశ్యమన్నారు. కొత్త జీవనోపాధులను సృష్టించి ఆదాయాన్ని పెంచుకోవచ్చని తెలిపారు. అధిక ఆదాయాన్ని పొందడానికి తగిన ప్రణాళికలు రూపొందించి ప్రత్యేక యాప్‌లో పొందుపర్చి చేయూత అందించనున్నట్లు వివరించారు. అర్హులైన సంఘాల వివరాలను యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. సమావేశంలో ఏపీఎం కందిక సుధాకర్, సీసీలు కరుణ, నర్సయ్య, మండల సమాఖ్య కార్యదర్శి కృష్ణకుమారి, తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధి

దుగ్గొండి : లక్‌పతి దీదీ పథకంతో మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించనున్నారని ఏపీఎంలు సుధాకర్, గీతారాణి తెలిపారు. మండల కేంద్రంలోని ప్రశాంతి మండల సమాఖ్య కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. పథకంపై అవగాహన కల్పించారు.

తహసీల్దార్‌ను కలిసిన నాయకులు



తహసీల్దార్‌ను సన్మానిస్తున్న నాయకులు

చిట్యాల: నూతనంగా వచ్చిన తహసీల్దార్ ఎండీ.ఖజా మొహియొద్దీన్‌ను కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ముకిరాల మధువంశీకృష్ణ, మండల కోఆప్షన్ సభ్యులు ఎండీ.రాజ్ మహ్మద్ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. వారితో పాటు నాయకులు, సామాజిక సేవ కార్యకర్త సర్వ శరత్, ఆర్‌ఐ రాజు తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి 'పల్స్‌పోలియో'

కాళేశ్వరం: నేటి(ఆదివారం) నుంచి మూడు రోజుల పాటు నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమానికి కాళేశ్వరం పీహెచ్‌సీ పరిధిలో ఇరవై రెండు పోలియో బూత్‌లకు గాను రెండు రూట్‌లు అందులో ఉన్నాయని కాళేశ్వరం వైద్యాధికారి డాక్టర్ సుస్మిత శనివారం ప్రకటనలో తెలిపారు. కాళేశ్వరం, అన్నారం ఒక రూట్, మహదేవపూర్, బొమ్మాపూర్ రెండవ రూట్ ఏర్పాటు చేసి వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు, అంగన్వాడీ వర్కర్స్, వాలంటీర్‌ల ద్వారా నిర్వహణ జరుగుతుందని పేర్కొన్నారు. ఈ పల్స్ పోలియో కార్యక్రమంలో ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు రెండు చుక్కల పోలియో వ్యాక్సిన్ డోస్‌లు వేయించి పోలియో రహిత సమాజ నిర్మాణంలో అధికారులు, నాయకులు ప్రజలు, ఉద్యోగులు, భాగస్వాములు కావాలని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆమె కోరారు.

బెల్టుషాపులపై ఎక్సైజ్ దాడులు

కాటారం: మండలంలోని మేడిపల్లిలోని బెల్టుషాపులపై శనివారం ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. కిరాణ దుకాణాల్లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు దాడులు చేసినట్లు ఎక్సైజ్ సీఐ నరేందర్ తెలిపారు. సుమారు రూ.3500 మద్యం పట్టుకొని సంతోష్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఫ్లెక్సీ తొలగించాలి



మంత్రి బ్యానర్ కింద కట్టిన ఉత్సవాల ఫ్లెక్సీ

మహదేవపూర్: మండల కేంద్రంలో రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు బ్యానర్ కింద కట్టిన శ్రీకాళేశ్వర ముక్తేశ్వర స్వామి శివరాత్రి ఉత్సవాలకు సంబంధించిన బ్యానర్‌ను వెంటనే తొలగించాలని విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు దేవరావు డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. మండల కేంద్రంలోని జాతీయ రహదారి వెంట ఇటీవల మంత్రి శ్రీధర్‌బాబు ఫ్లెక్సీలను పలువురు నాయకులు ఏర్పాటు చేశారని తెలిపారు. కాగా, మంత్రి ఫ్లెక్సీల కింద శివరాత్రి ఉత్సవాల పోస్టర్ ఫ్లెక్సీని కట్టడంతో మంత్రి కాళ్ల వద్ద శివుడి ఫొటో ఉంటుందని పేర్కొన్నారు. వెంటనే బ్యానర్‌ను తొలగించి ఉత్సవాల పోస్టర్ కట్టిన బాధ్యులపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు.

జాతర పనులు ముమ్మరం



కురవి: ఈనెల 8వ తేదీ మహాశివరాత్రి నుంచి భద్రకాళీ సమేత వీరభద్రస్వామి కల్యాణ మహోత్సవం సందర్భంగా జరగబోయే జాతర పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఇప్పటికే ప్రధాన ఆలయాలకు రంగులు వేయడం పూర్తి చేశారు. భద్రకాళీ అమ్మవారి ఆలయం, సత్రాలు, కల్యాణ కట్ట వద్ద చలువ పందిళ్లను శనివారం ఏర్పాటు చేశారు. జాతరకు వచ్చే భక్తులకు సౌకర్యాలు కల్పించేందుకు ఆలయ ఈఓ సత్యనారాయణ దగ్గరుండి పనులు చేయిస్తున్నారు.

మహిళల త్యాగాలను గుర్తించాలి



అవగాహన కల్పిస్తున్న ఆఫ్రిన్

ఏటూరునాగారం: మహిళలు వారి త్యాగాలకు గుర్తింపుగా జరుపుకునేదే మహిళా దినోత్సవమని, ప్రతి ఒక్కరూ మహిళలను గౌరవించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఆఫ్రిన్ అన్నారు. ఈనెల 8న నిర్వహించే ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం మండల కేంద్రంలోని మానసపల్లి 2 అంగన్‌వాడీ కేంద్రంలో నాలుగు అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో టీచర్లు, లబ్ధిదారులు కలిసి మహిళా దినోత్సవ నిర్వహించారు. సూపర్‌వైజర్ మాట్లాడుతూ.. స్త్రీ లేకపోతే సృష్టి లేదని సమాజానికి మనుగడ లేదని అన్నారు. అలాంటి స్త్రీలు ప్రస్తుతం సమాజంలో అనేక అవమానాలు, అనుమానాలకు గురవుతూ వారి జీవితాలు అర్ధంతరంగ ముగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్య, వైద్యం, రాజకీయం ఇలా అన్ని రంగాల్లో మహిళలు పురుషులకు దీటుగా విజయం సాధిస్తున్నారన్నారు. సమానత్వం మహిళల హక్కుల కోసం శతాబ్దం క్రితమే పోరాటం మొదలై నేటికీ కొనసాగుతుందన్నారు. సమాజంలో ఎలాంటి సమస్యనైనా పరిష్కరించే అవగాహన మహిళలకు ఉందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సరోజ, భవాని, వసంత, లలిత కుమారి తదితరులు పాల్గొన్నారు.

'పల్స్ పోలియో' సమర్థవంతంగా పూర్తిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ సుమలత

ఏటూరునాగారం: నేడు జరగబోయే పల్స్ పోలియో కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వర్తించాలని రొయ్యూర్ వైద్యాధికారిణి సుమలత అన్నారు. శనివారం మండల కేంద్రంలోని సబ్ సెంటర్‌లో పల్స్ పోలియోపై సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఉదయం 7 గంటల నుంచి కేటాయించిన సెంటర్లు, క్యాంప్‌ల వద్ద ఉండాలన్నారు. డ్యూటీలో ఎవరు నిర్లక్ష్యం వహించినా ఉన్నతాధికారులకు రిపోర్ట్ చేస్తామన్నారు. ఆశ వర్కర్లు ఇంటింటికీ వెళ్లి 0–5 చిన్నారులను పోలియో చుక్కలు వేయించడానికి తీసుకురావాలని, తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ స్వరూపరాణి, ఎంపీహెచ్ఎస్ కమల, ఏఎన్ఎంలు, నగేష్, జైల్‌బాబు ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆదివాసీ న్యాయ కళాశాల కోసం ఉద్యమించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సాయి

వెంకటాపురం(కె): భద్రాచలం కేంద్రంగా ఆదివాసీ న్యాయ కళాశాల కోసం ఉద్యమించాలని గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి అన్నారు. మండల కేంద్రంలో శనివారం గోండ్వానా సంక్షేమ పరిషత్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భద్రాచలం కేంద్రంగా ఆదివాసీ న్యాయ కళాశాలను ఏర్పాటుచేయటం ద్వారా ఈ ప్రాంతం నుంచి దూర ప్రాంతాలకువెళ్లి న్యాయ విద్యను అభ్యసించలేనివారికి ఉపయోగంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. భద్రాచలంలో ఈ కళాశాల ఏర్పాటు చేయాలని కోరుతూ.. ఈ నెల 4న నిర్వహించనున్న చలో భద్రాచలం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు తాటి రమేష్, కాంతయ్య, లోకేష్, ఐతు తదితరులు ఉన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి



అక్షరాభ్యాసం చేయిస్తున్న సరోజ

టేకుమట్ల: గర్భిణులు, బాలింతలు ప్రతి రోజు పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సరోజ అన్నారు. శనివారం మండలంలోని రామకిష్టాపూర్ (టీ) అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం సరోజ మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రంలో అందించే అదనపు ఆహారం పాలు, గుడ్డు క్రమం తప్పకుండా బాలింతలు, గర్భిణులు తీసుకోవాలని కోరారు. ప్రతి రోజు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రానికి పంపించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మహేందర్ గౌడ్, అంగన్‌వాడీ టీచర్ స్వరూప, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న యూత్ కాంగ్రెస్ నాయకులు

టేకుమట్ల: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల 11,062 పోస్టులతో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ యూత్ కాంగ్రెస్ మండల టౌన్ అధ్యక్షుడు కొలుగూరి అనిల్ ఆధ్వర్యంలో యూత్ కాంగ్రెస్ నాయకులు సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బండ శ్రీకాంత్ హాజరై మాట్లాడుతూ 10 సంవత్సరాల బీఆర్ఎస్ పాలనలో నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన రెండు నెలల్లోనే 25వేల ఉద్యోగాలు భర్తీ చేశారన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కోటగిరి సతీష్ గౌడ్, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నూనేటి రమేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ యశ్వంత్, ప్రధాన కార్యదర్శి మధుకర్, నాయకులు క్రాంతి, అనిల్, ధనుష్ తదితరులు పాల్గొన్నారు.

సభను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న పాయం చిన్న చంద్రన్న

నెక్రూలాసెంటర్: విప్లవ పార్టీల ఐక్యత సందర్భంగా నేడు ఖమ్మం జిల్లాలో జరిగే బహిరంగ సభకు విప్లవ శ్రేణులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి పాయం చంద్రన్న పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీజేపీ మరోసారి అధికారంలోకి వస్తే రాజ్యాంగం కల్పించిన హక్కులను విధ్వంసం చేస్తుందని విమర్శించారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి, నాయకులు పూనెం ప్రభాకర్, వెలుకురు జగ్గన్న, ముంజంపల్లి వీరన్న పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ములుగు :
9705748198
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
డి. గణేష్ బాబు (S.R) : 9490002099, 7997958188
పి. చంద్రశేఖర్ (A.C.O) : 8074606274